సాక్షి మంచిర్యాల

గురువారం ❘ 22 ❘ మే ❘ 2025



పుష్కర ఘాట్లపై మట్టికుప్పలు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర గోదావరి వద్ద పుష్కరఘాట్లు అస్తవ్యస్తంగా మారాయి. మట్టి కుప్పలు పేరుకుపోవడంతో భక్తులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. 8లో▸



కళాశాల ఏర్పాటు కలేనా..!

భీమిని, కన్నెపల్లి మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు లేక విద్యార్థులు చదువు మానేయాల్సి వస్తోంది. కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.0 /25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు బలంగా వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జన్నారం డీఆర్‌వో సస్పెన్షన్

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ జన్నారం డిప్యూటీ రేంజ్ అధికారి(డీఆర్‌వో) తిరుపతిని సస్పెండ్ చేస్తూ టైగర్‌జోన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతరాం ఉత్తర్వులు జారీ చేసినట్లు రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. జన్నారం రేంజ్ పరిధిలోని గడ్డంగూడ అటవీ భూమిలో అక్రమంగా వేసిన గుడిసెలు తొలగించగా, తిరిగి గిరిజనులు గుడిసెలు వేసుకున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈ నెల 15న బీట్ అధికారి శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసి, డీఆర్వో తిరుపతికి మెమో ఇచ్చారని పేర్కొన్నారు. బుధవారం డీఆర్వోను కూడా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు.

సరస్వతీ పుష్కరాల్లో ఎమ్మెల్యే వినోద్



నదిలో పుణ్యస్నానం చేస్తున్న వినోద్

బెల్లంపల్లి: కాళేశ్వరం సరస్వతీ పుష్కరాల్లో భాగంగా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ బుధవారం పుణ్యస్నానం ఆచరించారు. భూపాలపల్లి జిల్లా కాళేశ్వర ముక్తేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమం వద్ద పుష్కర స్నానం చేశారు. అనంతరం కాళేశ్వరుడిని, మహా సరస్వతి దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రజలను సల్లంగా చూడాలని మొక్కుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ శ్రేణులు, మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నారు.

నేడు భాగ్యరెడ్డివర్మ జయంతి

మంచిర్యాలటౌన్: ఈ నెల 22న ఉదయం 9:30 గంటలకు కలెక్టరేట్‌లో భాగ్యరెడ్డివర్మ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు, సంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టులో కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నీల కంఠేశ్వర్‌రావు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దేశంలోని యువతకు ప్రోత్సాహం అందించడానికి ఐటీ పరిశ్రమ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఓపెన్ యూనివర్సిటీలు నెలకొల్పారని, 18 ఏళ్ల యువతకు ఓటు హక్కు కల్పించారని, గ్రామీణాభివృద్ధి కోసం ప్రణాళికలు రచించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా ఇంచార్జి రాజేశం, జైపూర్ మండల కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ట్రైబల్ సేవాదల్ ఇంచార్జి కోవ జంగు, శ్రీరాంపూర్ సేవాదల్ నాయకులు యాకూబ్‌రెడ్డి, నాయకులు మార్కండేయ, చంద్రమౌళి పాల్గొన్నారు.

వ్యాక్సిన్ వేసుకోవాలి




వ్యాక్సినేషన్ పరిశీలిస్తున్న జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ అనిత

మంచిర్యాలటౌన్: వ్యాక్సిన్‌ను సమయానుసారంగా వేసుకోవాలని, తప్పిపోయిన వ్యాక్సిన్లను వేసేందుకు ఈ నెల 21 నుంచి 28వరకు వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నామని జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ అనిత తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాల అర్బన్ హెల్త్‌సెంటర్‌లో క్యాచ్ అప్ టీకాల రెండో విడత కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు, చిన్నారులు వేసుకునే వ్యాక్సిన్లలో ఏవైనా తప్పిపోయి ఉంటే అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వేసేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సరైన సమయంలో టీకాలు తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు.

కాసుల శాఖ!




జిల్లా కార్మిక శాఖ కార్యాలయం


Aa అడిగిన రోజు స్కిప్ చేసేసారు ఆ పర్సన్... But aa file move అయిందో లేదో తెలియదు... ఆఫీస్ లో money ఇస్తేనే పని అయ్యేలా ఉంది సార్.

లాస్ట్ year మ్యారేజ్ క్లైమ్ బెనిఫిట్ అప్పుడు కూడా 3k అడిగారు. అప్పుడు 30k benefit వచ్చింది. Old office LIC colony lo ఉండేది aa time lo..

07:50


Yes.. ఇది జరుగుతుంది సార్. రీసెంట్ గా ఒక పర్సన్ కూడా మెటర్నిటీ బెనిఫిట్ కోసం అప్లికేషన్ ఫారామ్ అన్ని ఇవ్వడానికి వెళ్తే అక్కడ ఉన్న అధికారి డబ్బులు అడగడం జరిగింది... సాక్షాత్ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యం లో ఉన్న కూడా ఇలాంటివి జరుగుతుంటే పైన ఉన్న అధికారులు ఏం చేస్తున్నారో తెలియడం లేదు...

07:39

తమను డబ్బులు అడిగారని వాట్సాప్‌లో బాధితులు పంపిన సందేశాలు

- జిల్లా కార్మిక శాఖకు అవినీతి మకిలీ
- 'సాక్షి' కథనంతో మరిన్ని వెలుగులోకి..
- శ్రమజీవుల నుంచి డబ్బుల వసూళ్లు
- ఆరోపణలు వచ్చినా అధికారులపై చర్యల్లేవు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా కార్మిక శాఖ కార్యాలయంలో శ్రమజీవుల నుంచి డబ్బుల వసూళ్లపై బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. బుధవారం 'సాక్షి'లో 'కార్మిక శాఖలో కక్కుర్తి' శీర్షికన అక్కడి సిబ్బంది పైసలిస్తేనే పని చేస్తున్న తీరుపై కథనం ప్రచురితం కావడంతో తమ నుంచీ గతంలో ఇదే తీరుగా డబ్బులు తీసుకున్నారని జిల్లాలో పలువురు బాధితులు తెలిపారు. పాత కార్యాలయం నుంచి కొత్త కలెక్టరేట్‌లోకి కార్యాలయం మారేదాక గత కొంతకాలంగా పలువురు కార్మిక కుటుంబాల నుంచి డబ్బులు వసూలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సేవలు పొందాలంటే ఎంతో కొంత ముట్టజెప్పాల్సి వచ్చిందని వెల్లడిస్తున్నారు. వాట్సాప్, ఫోన్లలో ఈ విషయాలు తెలియజేస్తున్నారు. మరోవైపు కార్యాలయంలో జరుగుతున్న అవినీతి వ్యవహారం కలెక్టరేట్ ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కార్యాలయం పక్కనే ఉన్న బాత్రూంలోకి వెళ్లి బాధితుల నుంచి డబ్బులు తీసుకుంటున్న తీరు తెలిసి తోటి ఉద్యోగులే ఆశ్చర్యపోతున్నారు. మరోవైపు కలెక్టరేట్‌కు సమీపంలోనే సీసీసీ నస్పూర్‌లో ఏసీబీ కార్యాలయం ప్రారంభించినప్పటికీ ఎలాంటి జంకు లేకుండా ప్రజల నుంచి లంచాలు తీసుకోవడం గమనార్హం.

తగిన చర్యలులేకనే..

కలెక్టరేట్ పరిధిలో పౌర సేవల కోసం వచ్చే సామాన్యుల నుంచి బహిరంగంగానే డబ్బులు తీసుకునేందుకు కొందరు ఉద్యోగులు తెగిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారుల పకడ్బందీ నిఘా లేక ఈ అక్రమాలు సాగుతున్నాయి. మరోవైపు ఆరోపణలు వస్తున్న వారిపైనా కనీస చర్యలు లేకపోవడంతోనూ తమను అడిగే వారు లేరనే ధైర్యంతో కొందరు ఉద్యోగులు ప్రజల నుంచి డబ్బుల వసూళ్లకు తెగబడుతున్నారు. లంచం ఇచ్చే బాధితులు ఎలాగు బయటకు చెప్పేందుకు ముందుకు రారు. ఒక వేళ వస్తే వాళ్ల పని చేయబోమనే మెలిక పెట్టవచ్చు అనే ధీమాలో ఉంటున్నారు. దీంతో సర్కారు ఉద్యోగులుగా వేతనాలు తీసుకుంటూనే చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోకపోతే కలెక్టరేట్‌లో అవినీతి మరింత పెరిగే ప్రమాదముంది.

ఆపరేటర్ వసూలు చేసి అధికారికి..

జిల్లా కార్మిక శాఖలో మూడు సర్కిళ్లలో పని చేస్తున్న అధికారులు తమ చేతికి మట్టి అంటకుండా కింది స్థాయి సిబ్బందితో వసూళ్లు చేయిస్తున్నారు. వచ్చిన డబ్బులను తర్వాత ఎవరికి వారు పంచేసుకుంటున్నారు. ఎవరైనా కార్మికుడు తమ సేవల కోసం వస్తే రూ.వెయ్యి నుంచి రూ.3వేల వరకు అడుగుతున్నారు. కొన్ని సార్లు మరింత ఎక్కువగా కావాలని అంటున్నారు. దీంతో బేరమాడి చివరకు ఎంతో కొంత తీసుకుంటున్నారు. కార్మిక కుటుంబాలకు వచ్చే ప్రయోజనాల్లో తమ పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, వివాహ ప్రోత్సాహం, ప్రమాదాల బారిన పడితే చికిత్స ఖర్చులు, చనిపోతే దహన సంస్కారాలు, నైపుణ్య అభివృద్ధి కోసం తదితర ప్రయోజనాలు పొందవచ్చు. ఈ సేవలకు వచ్చే వారి నుంచే ముక్కుపిండి వసూళ్లు చేస్తున్నారు. కార్మికులు సైతం డబ్బులు ఇవ్వకపోతే తమ పని చేయరనే కారణంతో ఎక్కడా ఫిర్యాదు చేయకుండా అడిగినంత ఇస్తున్నారు. ఇవేకాకుండా కార్మిక శాఖ పరిధిలో పరిశ్రమలు తనిఖీలు, షాపింగ్‌మాళ్లు, రిజిస్ట్రేషన్లు, లైసెన్సుల జారీల్లోనూ అక్రమాలకు పాల్పడుతున్నారు. కార్మిక వేతనాలు, భవన నిర్మాణ, తదితర సంఘటిత, అసంఘటిత రంగాల వారి సంక్షేమం కోసం పని చేయాల్సిన కార్మిక శాఖ అధికారులు కాసుల కోసం పని చేయడం విమర్శలకు తావిస్తోంది.

వసూళ్లపై కొందరి స్పందనలు

ఓ బాధితుడు మాట్లాడుతూ కార్మిక కుటుంబాలు పెళ్లి చేసుకుంటే వచ్చే ఆర్థిక సాయం దరఖాస్తు సమయంలో రూ.3వేలు అడిగినట్లు చెప్పారు.

- గత నెలలో ప్రసవమైన ఓ కార్మిక కుటుంబానికి చెందిన బాధితుడి నుంచి కూడా డబ్బులు అడిగినట్లు తెలిపారు. అయితే డబ్బులు ఆ రోజు ఇవ్వలేదని, కానీ ఇవ్వకపోతే తన పని చేస్తారో లేదో అనే అనుమానం వ్యక్తం చేశాడు.

ఇందిరమ్మ ఇళ్లకు ధరాఘాతం

- పెరిగిన స్టీల్, సిమెంటు, ఇసుక ధరలు
- పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో 2,150 ఇళ్ల మంజూరు
- పనులు ప్రారంభించినవి 897 మాత్రమే..
- బేస్‌మెంటు స్థాయి వరకు పూర్తయినవి 134



మల్లిడి గ్రామంలో బేస్‌మెంట్ వరకు నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు

మంచిర్యాలటౌన్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రోజు రోజుకు పెరుగుతున్న ధరలు క్లైం వేస్తున్నాయి. స్టీల్, సిమెంటు, ఇసుక ధరలు పెరగడం, ప్రభుత్వం ఇచ్చే డబ్బులు సరిపోకపోవడంతో నిర్మాణాలు ముందుకు సాగని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇంటి స్థలం ఉండి ఇళ్లులేని నిరుపేదల సొంతింటి కల సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మొదటి విడతలో అవకాశం కల్పించింది. జిల్లాలోని 16మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఇంటిస్థలం ఉండి, ఇల్లు లేని 2,150మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వీరిలో 897మంది మాత్రమే ఇళ్లకు ముగ్గు పోసి పనులు చేపట్టారు. 134 బేస్‌మెంటు స్థాయి వరకు పూర్తి చేయగా.. ప్రభుత్వం రూ.1లక్ష చొప్పున హౌసింగ్ శాఖ ద్వారా అందజేసింది. ఇంటి నిర్మాణాన్ని బేస్‌మెంటు వరకు నిర్మిస్తే రూ.లక్ష, రూఫ్ లెవల్ వరకు పూర్తి చేస్తే రూ.1.25లక్షలు, స్లాబ్ వేస్తే రూ.1.75లక్షలు, రంగులు వేసిన తర్వాత రూ.లక్ష మొత్తంగా నాలుగు విడతల్లో రూ.5లక్షలు అందించనుంది. 897 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించినా మిగతా వారు నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్టీల్, సిమెంటు, ఇసుక ధరలు పెరగడం, ప్రభుత్వం ఇచ్చే డబ్బు సరిపోకపోవడంతోనే నిర్మాణానికి ముందుకు రావడం లేదని తెలుస్తోంది. వేసవి కాలం ముగుస్తుండడంతో వర్షాకాలంలో నిర్మాణం ఇబ్బందిగా మారనుంది. ఇసుక దొరకని పరిస్థితి ఎదురవుతుంది. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా అధికారులు చూడాల్సి ఉంది.

రెండో విడత జాబితాపై ఆశలు

మొదటి విడతలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారిలో సగం కూడా ప్రారంభించలేదు. ఒక్కో నియోజకవర్గంలో 3,500 చొప్పున వచ్చేలా అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో ఇళ్లు మంజూరు చేయాల్సి ఉంది. రెండో విడతలో లబ్ధిదారులను ఎంపిక చేయడంలో మండల, మున్సిపల్ అధికారులు తాత్సారం చేస్తున్నారు. రెండో విడతలోనైనా ఇళ్లు వస్తుందా లేదా అని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. మండలాల్లో లబ్ధిదారుల ఎంపికపై అధికారులు ఇంకా కసరత్తు చేస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు.

జాబితా సిద్ధం చేస్తున్నాం

ఇందిరమ్మ ఇళ్లు బేస్‌మెంటు స్థాయి వరకు నిర్మించుకున్న వారికి రూ.లక్ష చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశాం. ఇల్లు మంజూరైన వారు నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేసుకుంటే డబ్బులు ఖాతాల్లో వేస్తాం. పైలట్ ప్రాజెక్టు గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఇల్లు నిర్మించుకునేలా చూస్తున్నాం. రెండో విడత జాబితా మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు సిద్ధం చేస్తున్నారు. అర్హతను బట్టి ఇళ్లు మంజూరు చేస్తాం.

– బన్సీలాల్, హౌసింగ్ పీడీ, మంచిర్యాల

నేత్ర పర్వంగా పట్టాభిషేకం



కార్యక్రమంలో చిన జీయర్‌స్వామి

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పాలచెట్టు ప్రాంతంలో ఉన్న పంచముఖి ఆంజనేయస్వామి ఆలయ రజతోత్సవాల్లో బుధవారం సామూహిక శ్రీరామ పాదుకా పట్టాభిషేకం, కలుష పూజ నేత్రపర్వంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి హాజరై వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య పట్టాభిషేకం జరిపించారు. ఆలయ అర్చకులు గోవర్ధనగిరి అనంతాచార్యులు, కృష్ణకాంతాచార్యులు, వేదపండితులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన



చెన్నూర్ మండలంలో ధాన్యం కుప్పలోకి వరద నీరు రాకుండా కాలువ తీస్తున్న రైతు

- నీటిపాలైన ధాన్యం
- కాపాడుకునేందుకు రైతుల అరిగోస



దండేపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాల చుట్టూ నిలిచిన నీరు

మంచిర్యాలఅగ్రికల్చర్/వేమనపల్లి/జన్నారం/బెల్లంపల్లి/చెన్నూర్‌రూరల్/మందమర్రిరూరల్/దండేపల్లి/జైపూర్/భీమారం: జిల్లాలో బుధవారం ఉదయం నుంచి ఎండలు మండిపోగా సాయంత్రం కాగానే ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కోటపల్లి, చెన్నూర్, భీమారం, జైపూర్, మందమర్రి, బెల్లంపల్లి, వేమనపల్లి మండలాల్లో రాత్రి వరకు వర్షం వీడలేదు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి వరదనీటిలో కొట్టుకుపోయింది. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అరిగోస పడ్డారు. ధాన్యం కింద కవర్, పైన కవర్లు కప్పి తడవకుండా కాపాడుకునే ప్రయత్నం చేశారు. అయినా వరద నీరు ఎక్కువగా రావడంతో వర్షంలోనే పారతో కాలువలు తీశారు. 15 నుంచి 20 రోజులగా కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసుకుని ఎదురు చూస్తున్నా తూకం, మిల్లుకు తరలింపు లేక గోసపడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

- వేమనపల్లి మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వేమనపల్లి, దస్నాపూర్, కొత్తపల్లి, నీల్వాయి, కల్మలపేట వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. వర్షం ఆగకుండా కురుస్తుండడంతో ధాన్యం రాశుల వద్ద వరద నీరు వెళ్లిపోయేలా కవర్లు కప్పి రైతులు కష్టపడుతున్నారు.
- జన్నారం మండలంలో భారీ వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. మండల కేంద్రంలోని సినిమా హాలుకు వెళ్లే దారిలో నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తపాలపూర్ గ్రామంలో ఈదురుగాలులకు విద్యుత్ స్తంభం కూలిపోయింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడువకుండా కాపాడుకునే ప్రయత్నంలో రైతులు ఉన్నారు.
- బెల్లంపల్లిలో మధ్యాహ్నం అకాల వర్షం దంచికొట్టింది. రోడ్లపై వరద నీరు ప్రవహించింది. భారీ వర్షానికి ఉరుములు, మెరుపులు తోడు కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సింగరేణి ట్రాన్స్‌కో కరెంటు గంటల కొద్దీ నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.
- చెన్నూర్ మండలం కిష్టంపేట, లంబడిపల్లి, లింగంపల్లి, అక్కెపలి, అంగ్రాజ్‌పల్లి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో రైతులు హుటాహుటిన ధాన్యంపై కవర్లు కప్పారు. కొన్ని చోట్ల ధాన్యం తడిసింది.
- మందమర్రి మండలం సారంగపల్లిలో కొనుగోలు కేంద్రంలో వరిధాన్యం తడిసింది. 20 రోజులుగా ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికి నాలుగైదు సార్లు అకాల వర్షం పడి ధాన్యం తడిసిందని, తిరిగి ఆరబెట్టే సరికి రోజులు గడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.
- దండేపల్లి మండలంలో బుధవారం సాయంత్రం ఎడతెరిపి లేని భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలు, కుప్పల చుట్టూ నీళ్లు నిలిచాయి.
- జైపూర్ మండల కేంద్రంతోపాటు ముదిగుంట, కాన్కూర్, రామారావుపేట, ఇందారం, టేకుమట్ల, షెట్‌పల్లి, కుందారం, కిష్టాపూర్, వేలాల, శివ్వారం గ్రామాల్లో వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యం తడిసిపోయింది.
- భీమారం మండలంలో వరి కోతలు ఇంకా పూర్తి కాలేదు. వర్షానికి పొలాల్లో నీరు నిలిచింది.



వేమనపల్లి: నీళ్లలో వరిధాన్యం కుప్పలు



వేమనపల్లి: వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలను చూపిస్తున్న రైతు కాటెల రాజన్న



చెన్నూర్‌రూరల్: కిష్టంపేటలో వర్షానికి ధాన్యం తడవకుండా కవర్లు కప్పిన దృశ్యం

మరో వారం రోజుల వరకు యంత్రాలు వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పోతన్‌పల్లిలో ఆరబెట్టిన వరిధాన్యం తడిసింది. వరద నీళ్లు ధాన్యం కుప్పల కింద నుంచి ప్రవహించాయి. లారీలు సక్రమంగా రాకపోవడంతో ధాన్యం కేంద్రంలోనే నిలిచిపోయిందని రైతులు తెలిపారు.

పోలీసుల పని తీరు భేష్

- మూడో స్థానంలో రామగుండం పోలీస్ కమిషనరేట్
- సిటిజన్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఎంపిక
- డీజీపీ చేతుల మీదుగా అవార్డు అందుకున్న డీసీపీ భాస్కర్



డీజీపీ జితేందర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం: పోలీసుల పనితీరు, బాధితులకు అందిస్తున్న సేవలు తదితర అంశాలపై రాష్ట్ర వ్యాప్తంగా క్యూఆర్ కోడ్ ద్వారా సిటిజన్ ఫీడ్ బ్యాక్ సేకరణకు పోలీస్ శాఖ గత ఏడాది శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా టాప్ 10 యూనిట్లను ఎంపిక చేసింది. ఇందులో రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు మూడో స్థానం దక్కింది. డీజీపీ జితేందర్ చేతులమీదుగా రామగుండం పోలీస్ కమిషనరేట్ తరఫున బుధవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో ఉత్తమ అవార్డును మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అందుకున్నారు. క్యూఆర్ కోడ్‌లను కమిషనరేట్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్లు, గ్రామాలు, పట్టణాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసి వాటిపై అవగాహన కల్పించారు. ప్రజలు అభిప్రాయాలను తెలియజేశారు. అవార్డు రావడంపై పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీస్ అధికారులను అభినందించారు.

టీచర్ల నైపుణ్యాల పెంపునకు శిక్షణ

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్



హాజరైన ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు

మంచిర్యాలఅర్బన్: టీచర్లు వృత్తి పరంగా విద్యా బోధన నైపుణ్యాలు పెంపొందించుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మంచిర్యాల గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులే సమాజ మార్పుకు దిక్సూచిలని, దేశ భవిష్యత్ తరగతి గదిలో నిర్మితమవుతుందని అన్నారు. పాఠశాలల్లో అమలవుతున్న కార్యక్రమాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. వచ్చే విద్యాసంవత్సరంలో ఉపాధ్యాయులు, పాఠశాలలపై మరింత పర్యవేక్షణ పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కోర్సు సెంటర్ క్వాలిటీ కో-ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, రిసోర్స్‌పర్సన్లు, ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

గ్రామ పరిపాలన పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 25న గ్రామ పరిపాలన పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావులతో కలిసి జిల్లా విద్య, వైద్య, ఆరోగ్య, అగ్నిమాపక, విద్యుత్, సమాచార శాఖల అధికారులు, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ శివాజీతో గ్రామ పరిపాలన అధికారుల పరీక్ష నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతిస్తామని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణకు ముఖ్య పర్యవేక్షకులు, ఇన్విజిలేటర్లు, ఇతర అధికారులు, సిబ్బందిని నియమించామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, అగ్నిమాపక శాఖ అధికారి రమేష్‌బాబు, విద్యుత్ శాఖ అధికారి రమ్యశ్రీ, కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్, జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయురాలికి అరుదైన గౌరవం


అరుణ బట్టువార్

ఇంద్రవెల్లి: బాల సాహిత్య వికాసం కోసం విశిష్ట సేవలందిస్తూ విద్యార్థులను సాహితీ వేత్తలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న ఇంద్రవెల్లి జిల్లా పరిషత్ పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు అరుణ బట్టువార్‌కు అరుదైన గౌరవం దక్కింది. తన సంపాదకత్వంలో విద్యార్థులచేత ఇప్పటి వరకు ఆరు పుస్తకాలు ముద్రింపజేశారు. ఆమె సేవలను గుర్తించి ఈ నెల 25న హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరిషత్ 82వ స్థాపన దినోత్సవం సందర్భంగా నిర్వహించే బాల సాహిత్య సమ్మేళనంలో సత్కరించనున్నారు.

ప్రమాదవశాత్తు పశువుల కొట్టం దగ్ధం

బజార్‌హత్నూర్: ప్రమాదవశాత్తు పశువుల కొట్టం దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రంలోని కొంగర్ల పోతన్నకు చెందిన పశువుల కొట్టంలో బుధవారం మంటలు అంటుకున్నాయి. గమనించిన గ్రామస్తులు ఇచ్చోడ ఫైరింజన్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. ప్రొహిబిషన్ ఎస్సై రాజశేఖర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో మోటర్ల ద్వారా నీళ్లు పోయించారు. కొద్ది సేపటికి ఫైరింజన్ రావడంతో సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటనలో పశుగ్రాసంతో పాటు, వ్యవసాయ పనిముట్లు, పైపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.4 లక్షల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకుల బాహాబాహీ


ఇరు వర్గాలను చెదరగొడుతున్న పోలీసులు

మంచిర్యాలటౌన్: సరస్వతి పుష్కరాలకు పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణను ఆహ్వానించకుండా అవమానించడాన్ని నిరసిస్తూ బుధవారం యూత్ కాంగ్రెస్ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నిరసన చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించేందుకు వెళ్తుండగా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు వర్గీయులు బూతులు తిడుతూ అడ్డుకున్నారని ఎంపీ వర్గీయులు తెలిపారు. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతామని చెప్పినా వినకుండా తమను అడ్డుకోవడం సరికాదని యూత్ కాంగ్రెస్ నాయకులు రాయబారపు కిరణ్, ఆసంపల్లి శ్రీకాంత్ అన్నారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరుగుతుండడంతో పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పున్నం, సృజన్, మాయ తిరుపతి, దాసరి సంపత్, శ్రీశైలం, అరుణ్, రాజేశ్, వెంకటేశ్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

పుష్కర ఘాట్లపై మట్టికుప్పలు

- బాసరలో భక్తులకు తప్పని అవస్థలు


కలుషిత నీటిలో స్నానం చేస్తున్న భక్తులు


పుష్కర ఘాట్లపై నల్లమట్టి కుప్ప

బాసర: తెలంగాణ రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సరస్వతీ అమ్మవారు కొలువైన బాసర గోదావరి నది పుష్కరఘాట్ల వద్ద పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొదటి పుష్కర ఘాట్ నుంచి రెండో పుష్కరఘాట్ వరకు గోదావరి నీటి ప్రవాహం తగ్గడంతో పుష్కరఘాట్లపై నల్లమట్టి పెద్దపెద్ద కుప్పలుగా పేరుకుపోయింది. బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధిలో తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాదు దక్షిణాది రాష్ట్రాల నుంచి కూడా లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. ముందుగా పవిత్ర గోదావరినదిలో పుణ్య స్నానం ఆచరించడం పుణ్యఫలంగా భావిస్తారు. కానీ అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పట్టింపులేనితనంతో గోదావరి ఘాట్ తీరమంతా అస్తవ్యస్తంగా మారింది. బురద, చెత్తాచెదారంతో దుర్గంధం వెదజల్లుతోంది. బాసర ప్రధాన స్నానఘాట్ పైభాగంలో గంగమ్మ విగ్రహం, ఘాట్ కిందిభాగం మెట్ల వద్ద శివలింగం ఉంది. ఇక్కడ అనేక ఏళ్లుగా ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇటీవల పారిశుద్ధ్య నిర్వహణ గాలి కొదిలేయడంతో శివలింగం కళ తప్పుతోంది. ఎంట్రన్స్‌లోనే పుష్కర ఘాట్లు చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి.

కలుషిత నీటిలోనే స్నానాలు

మహారాష్ట్రలోని నాసిక్ త్రయంబకేశ్వర్‌లో పుట్టిన గోదారమ్మ బాసర వద్ద చదువులమ్మ పాదాలను తాకి తెలుగురాష్ట్రాల్లోకి అడుగిడుతుంది. ఎగువన భారీ వర్షాలు కురిసినపుడు వచ్చే వరదలతో ఘాట్లు పరిశుభ్రమవుతున్నాయే తప్ప అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యమనే చెప్పాలి. గత పుష్కరాల సమయంలో రూ.10 కోట్లు వెచ్చించి నిర్మించిన ఘాట్లు అధ్వానంగా మారిపోయాయి. ఫలితంగా పుణ్యస్నానాల కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. అంతేకాకుండా గోదావరినదిలో నీళ్లు కూడా కలుషితం అయ్యాయి. ఆలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం షవర్స్ ఏర్పాటు చేసినా కొంత మంది భక్తులు కలుషిత నీటిలోనే స్నానాలు చేస్తున్నారు. ఇప్పటికైనా దేవాదాయశాఖ అధికారులు స్పందించి పుష్కరఘాట్లను పరిశుభ్రంగా ఉంచాలని భక్తులు కోరుతున్నారు.

విదేశీ పర్యటనకు ఏవో

- మంత్రులు, ఐఏఎస్‌లతో కలిసి వెళ్లనున్న విశ్వనాథ్
- బెల్లంపల్లికి చెందిన హార్టికల్చర్ అధికారి కూడా..


విశ్వనాథ్, ఏవో

ఆదిలాబాద్‌టౌన్: వ్యవసాయ శాఖ ద్వారా విదేశాల్లో అధ్యయనం కోసం ఆ శాఖ మంత్రి, ఐఏఎస్ అధికారులతో కూడిన బృందాన్ని పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బృందంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి ఎం.రఘునందన్‌రావు, రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ కె.సురేంద్ర మోహన్, హార్టికల్చర్ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తదితరులు ఉన్నారు. వీరితో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో టెక్నికల్ ఏవోగా పనిచేస్తున్న విశ్వనాథ్, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన ఉద్యానవన అధికారి జె.అర్చన ఎంపికయ్యారు. వీరు నెదర్లాండ్, ఫ్రాన్స్‌లోని ప్యారీస్‌లలో పర్యటించనున్నారు. జూన్ 10 నుంచి 15 వరకు కొనసాగే పర్యటనలో ఆ దేశాల్లో వ్యవసాయం, ఉద్యానవన పంటల సాగు స్థితిగతులు, దిగుబడులు సాధించేందుకు అనుసరిస్తున్న విధానాలు, నూతన వంగడాల సృష్టికి అవలంబిస్తున్న పద్ధతులు వంటి పలు అంశాలపై అధ్యయనం చేయనున్నారు. మూడు రోజుల చొప్పున ఆయా దేశాల్లో పర్యటిస్తారు. రాష్ట్ర బృందంలో ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులు ఉండటంతో ఇక్కడి రైతులకు సాగుపరంగా ప్రయోజనం కలిగే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అదుపులోకి మరికొందరు నిందితులు!

- ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో కొనసాగుతున్న విచారణ

దహెగాం/పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్ అటవీ ప్రాంతంలో గత వారం వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి పెద్ద పులి మృతి చెందడంతో అటవీశాఖ అధికారులు మంగళవారం రాత్రి, బుధవారం పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్, అగర్‌గూడ, దహెగాం మండలంలోని గెర్రె, అమరగొండ గ్రామాలకు చెందిన పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఎల్లూర్ అటవీ ప్రాంతంలో మృతి చెందిన పెద్దపులి అవశేషాలు దహెగాం మండలంలోని చినరాస్పెల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి పెరట్లో పాతిపెట్టిన వాటిని బయటకు తీసిన విషయం తెలిసిందే. గ్రామ సమీపంలోని ప్లాంటేషన్ వద్ద పాతి పెట్టిన పులిచర్మం స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఉదయం కాగజ్‌నగర్ వైల్డ్ లైఫ్ సీసీఎఫ్ ఎల్‌వి సింగ్, సీసీఎఫ్ శాంతారాం, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టోబ్రియల్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం పులి అవశేషాలు లభించిన ఎల్కరి శేఖర్ ఇంటికి వెళ్లి అతని భార్యను సైతం విచారించారు. పులిని ఖననం చేసిన ప్రదేశానికి వెళ్లి మరోసారి పరిశీలించారు. దహెగాం మండలంలోని చినరాస్పెల్లి గ్రామానికి చెందిన ఒకరు, అమరగొండ, కర్జి గ్రామాలకు చెందిన మరో ఎనిమిది మందిని, పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్, అగర్‌గూడ గ్రామాలకు చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అదుపులో ఉన్న వారి కాల్‌డేటాను పరిశీలిస్తున్నారు. పులి అవశేషాలు అమ్మకానికి బేరం పెట్టారా? అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది. కాగా ఎలాంటి సమాచారం లేకుండా విచారణ పేరుతో అమాయకులను అటవీశాఖ అధికారులు వేధిస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు వాపోతున్నారు. పులిని హతమార్చిన వారిని శిక్షించి అమాయకులను వదిలిపెట్టాలని వేడుకుంటున్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వైల్డ్ లైఫ్ పీసీసీఎఫ్..

పెంచికల్‌పేట్ రేంజ్ పరిధిలోని ఎల్లూర్ అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలతో పెద్ద పులిని హతమార్చిన ప్రాంతాన్ని వైల్డ్ లైఫ్ పీసీసీఎఫ్ ఎలుసింగ్ మెరు బుధవారం పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎఫ్‌డీపీటీ శాంతారాం, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ ఉన్నారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని పొచ్చరకు చెందిన కొలిపెల్లి వినయ్ (19) మావల మండలంలోని ఓ పెట్రోల్ పంపులో పని చేసేవారు. నెల రోజుల నుంచి పనికి వెళ్లకుండా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. బుధవారం పొచ్చర శివారు ప్రాంతంలోని జాతీయ రహదారి సమీపంలో ఉరేసుకున్నాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

మండలంలోని చాందా (టి) గ్రామానికి చెందిన చింతల నారాయణ (59) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నారాయణ పలుచోట్ల చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఇంటి వద్ద పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులకు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు యువకుల బైండోవర్


బైండోవర్ చేస్తున్న పోలీసులు

నిర్మల్‌రూరల్: గంజాయి విక్రయిస్తున్నారన్న అనుమానంతో జిల్లా కేంద్రంలో ఇద్దరు యువకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. గుండంపెల్లి గ్రామానికి చెందిన సత్యపోలు యోగేష్, భైంసా పట్టణం పురాణ బజార్‌కు చెందిన షేక్ కైఫ్ జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్‌పేట్‌లో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో రూరల్ పోలీసులు అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా వారి వద్ద ఎలాంటి గంజాయి లభించలేదు. కానీ భవిష్యత్‌లో గంజాయి సేవించడం లేదా విక్రయిస్తారన్న అనుమానంతో వారిద్దరిని రూరల్ తహసీల్దార్ సంతోష్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానా లేదా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టోల్ ట్యాక్స్ నిలిపివేయాలని ధర్నా


ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

చెన్నూర్‌రూరల్: కిష్టంపేట సమీపంలోని వైజంక్షన్ వద్ద టోల్ ట్యాక్స్ నిలిపి వేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో టోల్‌గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా ట్యాక్స్ పేరుతో దోపిడీకి గురిచేస్తున్నారన్నారు. అటవీశాఖలో ఎక్కడా ఈ టాక్స్‌లు వసూలు చేయడం లేదన్నారు. కాళేశ్వరంలో పుష్కరాలు నిర్వహిస్తున్న సమయంలోనే ఈ ట్యాక్స్ వసూలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బత్తుల సమ్మయ్య, రాపర్తి వెంకటేశ్వర్‌గౌడ్, బుర్ర రాజశేఖర్‌గౌడ్, తుమ్మ శ్రీపాల్, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ పనులపై సమీక్ష


సమీక్ష నిర్వహిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో సింగరేణి నూతనంగా ఏర్పాటు చేస్తున్న 67.5 మెగా వాట్స్ సోలార్ పవర్ ప్లాంట్ పనులపై ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్యనారాయణ బుధవారం ఏరియా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏరియా జీఎం దేవేందర్‌తో పాటు అధికారులను అడిగి పనుల అభివృద్ధిని తెలుసుకున్నారు. పవర్ ప్లాంట్ ఏర్పాటు పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జీఎం (ఈఅండ్‌ఎం) సోలార్ ఎనర్జీ జీఎస్ జానకీరామ్, ఎస్వో టూ జీఎం విజయ్‌ప్రసాద్, ఏరియా ఇంజనీర్ (ఈఅండ్‌ఎం) వెంకటరమణ, పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, కేకే గ్రూపు ఏజెంట్ రాంబాబు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, ఐఈడీ రాజన్న పాల్గొన్నారు.

ఇసుక ఫిల్టర్ చేసే బోట్ సీజ్


సీజ్ చేసిన ఇసుక ఫిల్టర్ బోట్‌తో పోలీసులు

జైనథ్: పెన్‌గంగ నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వ్యాపారి అభిలాష్‌రెడ్డితో పాటు సాంగ్వి గ్రామ వీడీసీ సభ్యులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు పెన్‌గంగ నది శివారులోని సాంగ్వి గ్రామం వద్ద ఎస్సై గౌతమ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉల్లాస్, సిబ్బందితో కలిసి దాడి చేసి ఇసుకను ఫిల్టర్ చేసే బోట్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇసుక దొంగతనం, పీడీపీపీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

దాడి చేసిన వ్యక్తికి జరిమానా

మంచిర్యాలక్రైం: కోర్టు ఆవరణలో ఒకరిపై దాడికి పాల్పడిన వ్యక్తికి రూ.వెయ్యి జరిమానా విధిస్తూ స్థానిక సివిల్ కోర్టు జడ్జి కే.నిరోషా బుధవారం తీర్పునిచ్చినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. గౌతమినగర్‌కు చెందిన బిల్ల మల్లయ్య హైటెక్ సిటీకి చెందిన ఆజ్మీర రాజేశ్‌పై చెక్‌బౌన్స్ కేసు వేశాడు. 2017 సెప్టెంబర్ 14న కోర్టులో హాజరయ్యేందుకు రాగా రాజేశ్ కోర్టు ఆవరణలో మల్లయ్యపై దాడికి పాల్పడ్డాడు. కేసు వాపస్ తీసుకోమ్మని బెదిరించాడు. మల్లయ్య అప్పటి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జికి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును స్థానిక పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేయగా కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేయాలని న్యాయమూర్తి ఆదేశాలతో రాజేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు


నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

జైనథ్ : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ గోదాం వద్ద బుధవారం గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై గౌతమ్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్‌నగర్‌కాలనీకి చెందిన సాహీల్ , ముషీర్ గంజాయి విక్రయిస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేసి 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పేకాడుతున్న 13 మంది..

నేరడిగొండ: పేకాడుతున్న 13 మందిని బుధవారం అరెస్టు చేసినట్లు ఇచ్చోడ సీఐ బండారి రాజు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు నేరడిగొండ ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో కలిసి వెళ్లి మండల కేంద్రంలోని నీలిమ దాబా వెనకాల దాడులు నిర్వహించి పేకాడుతున్న 13 మందిని పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారి వద్ద నుంచి పేక ముక్కలతో పాటు రూ.14,080 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు, 13 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సయ్యద్ జహీర్, గడ్డం రవి చందర్‌రెడ్డి, గూడూరు లవకుమార్, రాథోడ్ రవీందర్, అల్లూరి శివారెడ్డి, ఉప్పు పోశెట్టి, సోలంకి శ్రీనివాస్, నల్ల అడెల్లు, సోలంకి కరన్ సింగ్, గోతి గులాబ్ సింగ్, మాడ గంగాధర్, అల్లూరి శ్రీనివాస్ రెడ్డి, పవార్ సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

టపాసులతో ఇబ్బందులకు గురిచేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: అర్ధరాత్రి టపాసులు పేల్చి జనాలను ఇబ్బందికి గురిచేసిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన చోట ముష్రఫ్ తన జన్మదినం సందర్భంగా ఇంటి ముందు, బిల్డింగ్‌పై బాణసంచాలు పేల్చాడు. దీంతో చుట్టుపక్కల వారు ఇబ్బందులకు గురయ్యారు. ఓ ఇంటిపై వేసిన ప్లాస్టిక్ కవర్‌కు నిప్పంటుకోవడంతో కొంతభాగం కాలిపోయింది. దీంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఐదుగురిపై..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి) శివారు ప్రాంతం మీదుగా ఎలాంటి డాక్యుమెంట్‌లు లేకుండా వాహనంలో రెండు ఎడ్లను తరలిస్తున్న రాథోడ్ నితిన్, షేక్ సాకీర్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు. అలాగే వాహనాన్ని అడ్డుకుని బెదిరింపులకు గురి చేసిన చాందా (టి) గ్రామానికి చెందిన ముగ్గురు యువకులపై రాథోడ్ నితిన్, షేక్ సాకీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దాడి చేసిన వ్యక్తులపై..

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని పండ్ల వాపారిపై దాడికి పాల్పడిన షన్ను, మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలో తోపుడు బండ్లపై షేక్ షహెబాజ్ పండ్లు విక్రయిస్తున్నాడు. ఎద్దు వచ్చి పండ్లను తింటుండగా అతను ఎద్దును కొట్టడంతో షన్నుకు తగిలింది. దీంతో ఆయన ద్విచక్ర వాహనం దెబ్బతింది. ఇందుకు రూ.2వేలు ఇవ్వాలని అడిగాడు. తనవద్ద లేవని చెప్పడంతో తన మిత్రులను పిలిచి షహెబాజ్‌పై దాడికి పాల్పడ్డాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వివరించారు.

'ప్రభుత్వ ఉద్యోగులపై ఆరోపణలు సరికాదు'


ఫిర్యాదు చేస్తున్న నాన్ గెజిటెడ్ ఉద్యోగులు

జైపూర్: జైపూర్ మండలంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న తిరుపతిపై మాదిగ హక్కుల దండోరా నాయకులు చేసిన అసత్యపు, నిరాధారమైన ఆరోపణలు ఖండిస్తున్నామని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం మందమర్రి యూనిట్ అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి సతీశ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై కక్షపూరితంగా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ తిరుపతి, సభ్యులు రవిచందర్, శ్రీనివాస్, ప్రశాంత్, సత్యనారాయణ, సురేశ్, ఉదేయ్‌కుమార్, స్వామి, అపర్ణదేవి, రజిత, విజయ్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు కొంటున్నారా?

- జాగ్రత్తలు తప్పనిసరి


జొన్న విత్తనాలు

చెన్నూర్‌రూరల్: మరికొద్ది రోజుల్లో వానాకాలం సాగు ప్రారంభమవుతోంది. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల కొనుగోలులో రైతులు బిజీ అవుతున్నారు. ఇలాంటి సమయంలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. అనుమతులు లేని కంపెనీలకు చెందిన విత్తనాలు, కల్తీ విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చే అవకాశముంది. రైతులు ఒకటికి రెండుసార్లు ఆలోచించి అన్ని వివరాలు పరిశీలించాకే కొనుగోలు చేయాలి. అనుమానం వస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం అందించాలని చెన్నూర్ ఏవో యామిని సూచించారు. లైసెన్స్ లేని దుకాణాలు, దళారుల వద్ద ఎక్కడ పడితే అక్కడ కొనుగోలు చేయకూడదు. సరుకు, లాట్ నంబర్, తయారీ, తేదీ, రకం ఇలా అన్ని వివరాలు ఉండి సంతకం చేసిన బిల్లును విక్రయదారు (షాపు) నుంచి తప్పనిసరిగా తీసుకోవాలి. సంచులపై సీల్ తీసినట్లు లేదా విప్పదీసి తిరిగి కుట్లు వేసినట్లు కనిపిస్తే తీసుకోకూడదు. వ్యవసాయశాఖ నుంచి అనుమతి పొందిన డీలర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, సహకార సంఘాల నుంచి మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలి. క్రిమిసంహారక మందుల డబ్బాలపై కంపెనీ పేరు, తేదీ, కాలపరిమితి, గమనించి రసీదులు తీసుకోవాలి. ఏది ఎంత ధరతో కొన్నా.. డీలర్ లేదా దుకాణాదారు సంతకంతో తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలి. మీరు తీసుకున్న విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు నకిలీవని అనుమానం వస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలి. అలాగే లాట్ నంబర్, తయారీ తేదీలను తప్పనిసరిగా చూసుకోవాలి. లేదంటే గతేడాది విత్తనాలు, మందులు, ఎరువులు అంటకడతారు. రైతులు ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండి కాలం చెల్లిన మందులు, ఎరువులు, విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనకూడదు. అలాగే మందు డబ్బాలపై ఆకుపచ్చని లేబుల్ ఉందో లేదో గమనించాలి. ఆకుపచ్చ లేబుల్ ఉంటేనే ఆ మందును కొనుగోలు చేయాలి. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల కొనుగోలు విషయంలో రైతులు ఈ జాగ్రత్తలు తప్పకుండా పాటించి నాణ్యమైన దిగుబడులు పొందాలి.

నింగీ నేల ఏకమైనట్లు ఆవిష్కృతమైన అద్భుత చిత్రం



ఆకాశం మేఘావృతం కావడంతో ఇలా నేలను తాకుతుందేమో అనేట్లుగా కలిసిపోయిన చిత్రం బుధవారం సాయంత్రం సిరికొండ శివారులోని పంటచేనులో ఆవిష్కృతమైంది. పంటచేలలో వేసవి దుక్కులతో బిజీగా ఉన్న అన్నదాతలకు ఈ చిత్రం కనువిందు చేసింది. వాతావరణంలో ఒక్కసారిగా మార్పు మొదలై వర్షం కురిసింది.

– సిరికొండ